## క్లుప్తంగా

### పాస్టర్లతో సమావేశం

**మధిర:** క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ కుటుంబాలకు అందించే నూతన వస్త్రాల పంపిణీకి సంబంధించి నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం మధిర తహసీల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు మాట్లాడుతూ.. మండలాల వారీగా పాస్టర్ల కమిటీలను ఏర్పాటు చేసి నియోజకవర్గ పరిధిలో వెయ్యి మందికి దుస్తులు పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సెమీ క్రిస్మస్ వేడుక తేదీని నిర్ణయించాలని కోరారు. ప్రతి ఒక్కరూ క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు.

### ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

**మధిర:** మాటూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధునాతన దుస్తులు ధరించి పోటీల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అనేక చిత్రాలను వేయగా.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.

### పశువులకు టీకాలు

**కారేపల్లి:** పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా.. కారేపల్లి పశువైద్యశాల ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు శుక్రవారం టీకాలు వేశారు. కారేపల్లిలోని బొడ్రాయి బజార్, భారత్‌నగర్, బీసీకాలనీ, రజక బజార్‌లలో మేకలు, గొర్రెలకు టీకాలు వేశారు. అనంతరం కాపరులకు పలు సూచనలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారేపల్లి పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ శ్యామల, గోపాల మిత్ర మంగయ్య, రవి, కాపరులు తదితరులు పాల్గొన్నారు.

### నియామకం..


శ్రీనివాసరావు

**కల్లూరురూరల్:** ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఉమ్మడి ఖమ్మంజిల్లా అధ్యక్షుడిగా కల్లూరు మండలంలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామానికి చెందిన వినుకొండ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సురేష్‌కుమార్ వినుకొండ శ్రీనివాసరావుకు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కటుకూరి రత్న తారక రాజన్న తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

**ముదిగొండ:** విద్యార్థులు జ్ఞాన సముపార్జనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఖాళోజీ అవార్డు గ్రహీత ప్రముఖ కవి డాక్టర్ సీతారాం అన్నారు. ముదిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన 'మనము -మన పిల్లలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రతీరోజు కళాశాలకు హాజరు కావాలని, పేరెంట్స్ విద్యార్థులపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త రవిమారుత్, జర్నలిస్ట్ ప్రసేన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

**కల్లూరు:** ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరులో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సదర్భంగా పీఓడబ్ల్యూ కల్లూరు డివిజన్ కమిటీ కార్యదర్శి పరిమళ మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు ఖమ్మంపాటి అశోక్, జిల్లా హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పుల్లారావు, మల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప మాలధారుల నగర సంకీర్తన

**సత్తుపల్లిటౌన్:** స్వామియే అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప శరణం.. అంటూ అయ్యప్ప మాలధారులు శుక్రవారం పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. స్థానిక శ్రీహరి హరాత్మజ అయ్యప్పస్వామి దేవాలయంలో దర్శనం చేసుకొని ద్రోణంరాజు మల్లికార్జున శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో తాళ్లమడ పీఠం అయ్యప్ప మాలధారణ భక్తులు ఇరుముడులతో ఊరేగింపుగా అయ్యప్ప సంకీర్తనలు చేస్తూ శబరిమలై తరలి వెళ్లారు. కార్యక్రమంలో రమేష గురుస్వామి, మల్లిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి గురుస్వామి, భక్తులు పాల్గొన్నారు.

### కోతుల నుంచి కాపాడండి

**తల్లాడ:** తల్లాడ మేజర్ పంచాయతీలో కోతుల బెడద అధికంగా ఉందని, కోతుల సమస్యను అధికారులు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తల్లాడ గ్రామ సభలో స్థానికులు విన్నవించుకున్నారు. శుక్రవారం తల్లాడ పంచాయతీ గ్రామసభ ఈఓ కృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు కోతుల చేస్తున్న వికృత చేష్టలు, నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సాగు ప్రశ్నార్థకం..

- బీడుగా మారిన పొలాలు..
- పనిచేయని ఎత్తిపోతల పథకాలు
- నీరందక ఆందోళనలో ఆయకట్టు రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

**ముదిగొండ:** మండలంలోని పలు గ్రామాల సమీపాన 15 ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి కింద 1,090 ఎకరాలు సాగవాల్సి ఉండగా కేవలం 280 ఎకరాలకు మాత్రమే నీరందుతంది. ఎత్తిపోతల పథకాల ఆధునీకరణ లేకపోవడంతో మండలంలోని వల్లాపురం, ముత్తారం, న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి, గోకినేపల్లి, గందసిరి, గ్రామాల్లోని 10 ఎత్తిపోతల పథకాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్న కారు రైతులకు సాగు నీరందించేందుకు ఒక లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారడంతో ఈ పరిస్థితి నెలకొంది. పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల కక్కుర్తి వెరసి రైతుల పాలిట శాపంగా మారి వారి పంట పొలాలు బీడ్లుగా మారుతున్నాయి.

**రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు..**

రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పథకాలు నిరుపయోగంగా పడి ఉండడంతో భూములు బీడులుగా మారుతున్నాయి. మండలంలోని ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు విడుదలైన నిధులు, వాటి నిర్వహణ సక్రమంగా లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని పండ్రేగుపల్లి ఎత్తిపోతల పథకం 45 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా పంపు షెడ్ నిర్మాణం, ఆర్‌సీసీ పైపు లైన్ నిర్మాణం, పంపు సెట్లు ఏర్పాటు చేయకపోవడంతో నీటి సరఫరా కావడం లేదు. న్యూలక్ష్మీపురంలోని వాగుపై ఉన్న ఎత్తిపోతల కింద 149 ఎకరాలు సాగవ్వాల్సి ఉండగా, పైపుల మరమ్మతులు, పంపు సెట్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో భూములు బీడుగా మారాయి. ముత్తారం ఎత్తిపోతల పథకం కింద 40 ఎకరాలకు నీరందించాల్సి ఉండగా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇదీ నిరుపయోగంగా ఉంది. గందసిరిలో 1996లో ఎస్సీ రైతుల కోసం ప్రత్యేకంగా నిర్మాణం చేపట్టిన ఎత్తిపోతల పథకం కేవలం రెండేళ్లు మాత్రమే పని చేసింది. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా అరవై ఎకరాలకు సాగునీరందడం లేదు. దీంతో ఇప్పటి వరకు కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు.


పండ్రేగుపల్లిలోని మున్నేరు సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం


పండ్రేగుపల్లి వద్ద శిథిలావస్థకు చేరుకున్న మోటారు, పైపులైన్లు

– పెద్దమండవ ఎత్తిపోతల పథకానికి రూ 1.56 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు ఇదొక్కటి మాత్రమే పని చేస్తుంది. వల్లాపురం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ 1.65 లక్షలు రెండో దానికి ఎత్తిపోతల పథకానికి రూ. 5.76 లక్షలు వెచ్చించి మరమ్మతులు, పంపు షెడ్డు నిర్మాణం చేపట్టారు. పైపు లైన్ నిర్మాణం సక్రమంగా చేపట్టకపోవడమే కాకుండా విద్యుత్ మోటార్లు పని చేయకపోవడంతో 194 ఎకరాల భూములకు నీటి సరఫరా కావడంలేదు. వల్లాపురంలోని రెండు ఎత్తిపోతల పథకాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లోని రైతులు, సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు పలు మార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ఆవేదనను అర్థం చేసుకొని ఉన్న పథకాలకు మరమ్మతులు చేపట్టి బీడులుగా మారిన పొలాలను సాగులోకి తీసుకొచ్చేలా చేయాలని ఆయా గ్రామాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

### పదేళ్ల నుంచి పని చేయడం లేదు..



దళితులకని మంజూరు చేసిన పథకం ఏళ్ల తరబడి నుంచి పని చేయకపోవడంతో అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదు. మా కున్న కొద్దో గొప్పో ఉన్న పొలాల్లో పంటలు పండించుకొని బతుకులు వెల్లదీసుకుందామన్నా మమ్మల్ని ఎవరూ పట్టించుకున్నవారు లేరు. పక్కనే ఉన్న రైతు పొలాల్లోని భావులను నీటి ద్వారా పంట పండించుకుంటున్నాం.

– బలంతు ముత్తయ్య, రైతు, పండ్రేగుపల్లి

### బీడు భూములుగా మారాయి..



ప్రతి సంవత్సరం భూములను పడావుగా ఉంచలేక అప్పులు చేసి మోటార్లు కొనుక్కొని మున్నేరు నుంచి పొలాలకు నీళ్లు పెట్టుకుంటూ పంట పండించుకుంటున్నాం. పథకాలున్నాయి, అవకాశాలున్నాయి, కాని మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఉన్న లిప్ట పూర్తిగా కూలిపోయింది. ఇకనైనా అధికారులు పథకాలకు మరమ్మతులు చేయించడంతో పాటు రుణాలు పంపిణీ చేయాలి.

– నారపొంగు కిరణ్, రైతు, ముత్తారం

## ఘనంగా శ్రీహనుమత్ వ్రతాలు

**సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని శ్రీగాతాజ్ఞాన మందిరంలో గల శ్రీపార్థసారధి స్వామి వారి ఆలయంలో శుక్రవారం అర్చకులు సంతోష్‌శాస్త్రీ ఆధ్వర్యంలో సామూహిక హనుమత్ వ్రతాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయనం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, ట్రస్ట్ చైర్మన్ కొత్తూరు రాజా, బాలలీలా కృష్ణారావు, సత్యవతి, పుష్పావతి, చక్రధర్, శంకర్‌రావు, వెంకటనర్సయ్య, నరేష్, శారద, విజయలక్ష్మి, కొత్తూరు విజయ, రత్నకుమారి, కోటేశ్వరి పాల్గొన్నారు.

**ఏన్కూరు:** మండల కేంద్రంలోని కొదండరామాలయంలో శుక్రవారం హనుమాన్ వ్రతాలు నిర్వహించి.. స్వామికి పంచామృతాభిషేకాలు, తమలపాకుల అర్చన, వడమాలసేవ తదితర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మేడూరి రంగాచార్యులు, కిరణ్‌కుమార్ అచార్యులు, కిషోర్ అచార్యులు పాల్గొన్నారు.


సత్తుపల్లిటౌన్: సామూహిక హనుమత్ వ్రతంలో పాల్గొన్న భక్తులు

## రైతు చేతికి సంకెళ్లు అమానుషం


వైరాలో నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

**వైరా/బోనకల్:** లగచర్ల ఫార్మాసిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటంలో జైలుకు వెళ్లిన రైతు హీర్యానాయక్‌కు గుండె పోటు రాగా వైద్య పరీక్షలకై జైలు సిబ్బంది ఆయనను బేడీలతో తీసుకురావడం అమానుషం అని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. రైతుకు బేడీలు వేయడం పట్ల వైరా, బోనకల్‌లో రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. వైద్యం కోసం ఎటువంటి ఒత్తిడి లేకుండా తీసుకుపోవాల్సిన అధికారులు బేడీలు వేయడం వల్ల రైతు మరింత డిప్రెషన్‌లోకి వెళ్లాడన్నారు. అనంతరం రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. బోనకల్ తహసీల్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకై ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, పల్లెబోయిన కృష్ణ, శ్రీనివాసరావు, మధు, సుంకర సుధాకర్ తోట నాగేశ్వరరావు, సుధాకర్, రాజేష్, పుల్లయ్య, సూరయ్య, దొండపాటి నాగేశ్వరావు, గుడ్డూరి ఉమ, కిలారు సురేష్, వాణి, సునీత, పంతు తదితరులు పాల్గొన్నారు.

### రైతుల నిర్బంధాలు సిగ్గుచేటు..

**కారేపల్లి:** ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ హయాంలో సైతం రైతులు నిర్బంధాలు కొనసాగుతుండటం సిగ్గు చేటని అఖిలపక్షం నాయకులు విమర్శించారు. శుక్రవారం రైతు సమస్యలపై కారేపల్లి సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్షం సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి ప్రకాశ్, ప్రజాపంథా నాయకుడు తేజానాయక్‌లు మాట్లాడారు. రైతులు తమ సమస్యలపై ప్రశ్నిస్తే.. అడ్డగోలు అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. అరెస్ట్ చేసిన రైతులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు రామారావు, నరేందర్, జానకి, దేవప్రకాశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి..**

**బోనకల్:** జమిలీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కిలారు సురేష్, నాగేశ్వరరావు, రమేష్, వాణి, ఉమ, శ్రీనివాసరావు, కొరివి, పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**కల్లూరురూరల్:** కల్లూరులోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు అన్నారు. శుక్రవారం కార్మికులు ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి.. ఆస్పత్రి హెడ్‌నర్సుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దయాకర్‌రావు, ఆస్పత్రి కార్మికులు వంశీ, ప్రమోదు, మేరి, సత్యవతి, జానీబీ పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**చింతకాని:** మండలంలోని నేరడ గ్రామానికి చెందిన పగిళ్లపల్లి అప్పమ్మకు శుక్రవారం సీపీఎం మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు సీఎం సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అప్పమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన రూ.60 వేల చెక్కును అందచేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మంకెన నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు నారాయణ, రవి, మల్లయ్య, శంకర్ రావు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**తల్లాడ:** మండలంలోని కుర్నవల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కుర్నవల్లి ఏఈ దారా కృష్ణకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

**సత్తుపల్లిరూరల్/కల్లూరు/ఎర్రుపాలెం:** సత్తుపల్లి పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్, కల్లూరు సబ్‌స్టేషన్, మాముసూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు శరత్ బాబు, వెంకట్, గణేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ముదిగొండ:** ముదిగొండలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ముదిగొండ, పారిశ్రామిక ప్రాంత వినియోగదారులకు శనివారం ఉదయం 10:00 గంటల నుంచి 11:30వరకు విద్యుత్ ఉండదని ఏఈ మేకపోతుల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు

**సత్తుపల్లి:** సత్తుపల్లి బొగ్గు లోడింగ్‌కు సహకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును లారీ ఓనర్స్ అసోసియేషన్ శుక్రవారం స్వగృహం గండుగులపల్లిలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్‌లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రావి నాగేశ్వరరావు, కొండపల్లి రమేష్‌రెడ్డి, మౌలాలీ, ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, రహీం, ధర్మయ్య, కోట మోహన్‌రావు, దోసపాటి ప్రసాద్, ఏపూరి సాంబశివరావు, సాధిక్ పాల్గొన్నారు.

### చోరీ కేసులో ఇద్దరికి శిక్ష, జరిమానా

**దంతాలపల్లి:** దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువడిందని మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి ఎస్సై పి.రాజు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాలు... ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని రాంనగర్ కాలనీకి చెందిన నెల్లల అనిల్‌కుమార్, మంగలివాడకు చెందిన బీమిలి రాజ్‌కుమార్ గతేడాది దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెంకు చెందిన మారగాని కృష్ణమూర్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఈక్రమాన నేరస్తులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేయగా విచారణలో నేరం రుజువైంది. దీంతో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.500చొప్పున జరిమానా విధిస్తూ తొర్రూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సరిత శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ రేవతీదేవి వాదించగా కానిస్టేబుల్ రాజారాం సహకరించారు.

## ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించండి


సత్తుపల్లి: భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రాజేంద్రగౌడ్, సింగరేణి అధికారులు

**సత్తుపల్లి:** కిష్టారం పంచాయతీ పరిధిలోని భూములకు ఎకరానికి రూ.30 లక్షలు పరిహారం, ఇంటికో ఉద్యోగం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింప చేయాలని కిష్టారం భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్, జేవీఆర్, కిష్టారం ఓసీల పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భూమి పరిహారం ఇచ్చేదాక బాంబ్‌బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలని, మిగులుతున్న మూడు నుంచి ఏడు కుంటల భూములను కూడా తీసుకోవాలని డాక్టర్ మట్టా దయానంద్ సూచించారు. స్పందించిన ఆర్డీఓ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఈ నెల 17న కిష్టారంలో గ్రామసభ నిర్వహించి పరిహారంపై స్పష్టత ఇస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, ఉడతనేని అప్పారావు, నరుకుళ్ల రవి, పానెం ఈశ్వర్ పాల్గొన్నారు.

**ఎకరాకు రూ.40 లక్షలు..**

**వైరా:** సీతారామ ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణానికై భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం ఎకరానికి రూ.40 లక్షల చెల్లించాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. శుక్రవారం వైరా సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైరా డివిజన్ వ్యాప్తంగా ఉన్న సమస్యలపై పోరాటాలకు సిద్ధమన్నారు. కారేపల్లిలో 50 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని, సింగరాయపాలంలో నిరుపేదలకు పోడు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నూతన డివిజన్ కమిటీ సభ్యులు కృష్ణ, సుధాకర్, నాగేశ్వరరావు, నరేంద్ర, కుటుంబరావు, శ్రీనివాసరావు, కృష్ణార్జునరావు, బన్సీలాల్, రామారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


వేడుకకు హాజరైన క్రైస్తవులు

మాట్లాడుతున్న రాజా హెబేల్

**కల్లూరు:** కల్లూరు పట్టణ కేంద్రంలో లక్కినేని వారి గ్రౌండ్‌లో శుక్రవారం ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పాస్టర్ ఎబినేజర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ వేడులకు దైవ సువార్తికుడిగా హైదరాబాద్ డైరెక్టర్ పాస్టర్ రాజాహెబేల్, ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా హెబేల్ మాట్లాడుతూ.. సర్వ మానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. యేసు లోకరక్షకుడని, ఆయన అందరికీ సమాధానం కలుగజేస్తాడన్నారు. ముందస్తుగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రత్యేక గీతాలాపనలు, క్యాండిల్ సర్వీస్, క్రిస్మస్ కేక్ కటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు డాక్టర్ లక్కినేని రఘు, కట్టా అజయ్‌కుమార్, డాక్టర్ మాధవి, డాక్టర్ అచ్యుత రెడ్డి, ఏఐసీసీ జిల్లా నాయకులు నిర్మల్ కుమార్, జల్ది జయపాల్, ధర్నాసి బాలరాజు, డేవిడ్ రాజు, సంజీవరావు, సమర్పణపాల్, పరంజ్యోతి, జీవన్ కుమార్, మహేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత


ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మెడల్స్ బహూకరిస్తున్న కమిషనర్ చింతా వేణు

**వైరా:** ఈ నెల 12, 13 తేదీల్లో వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి శుక్రవారం సాయంత్రం మెడల్స్ అందజేశారు. మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, ఎస్‌ఐ భాగ్యరాజ్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సీఎం కప్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం యాకోబు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ముదిగొండ:** ముదిగొండ మండలంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు.. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంఈఓ రమణయ్య బహుమతులు అందించారు. క్రీడాకారులకు షీల్డ్, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. సీఎం కప్ ఓవరాల్ ఛాంపియన్‌గా బాణాపురం పాఠశాల విద్యార్థులు ఎంపికైయ్యారు.

## ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలి

**వైరా:** రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ , ఖమ్మం రైతు శిక్షణా కేంద్రం టెక్నికల్ ఏఓలు డి.అరుణకుమారి, టి.అరుణ జ్యోతి సూచించారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలో వారు రైతులతో మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు 100 శాతం రాయితీ, జనరల్ రైతులకు 90 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ గెల ధర కూడా బాగున్నందున.. నీటి వసతి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ మాయాన్ మంజుఖాన్, ఏఈఓ మేడా రాజేష్, రైతులు పాల్గొన్నారు.

**పంట అవశేషాలు నేలలో కలియదున్నాలి..**

**బోనకల్:** వరిపంట కోతల అనంతరం మిగిలిన పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం వలన ప్రయోజనాలు పొందవచ్చని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని ముష్టికుంట్లలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పంట అవశేషాలు నేలలో కలియదున్నడం ద్వారా పంట దిగుబడి 5నుంచి 10శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పసునూరి వినయ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

### విద్యార్థుల భోజనానికి రూ.4లక్షలు వితరణ


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్న యాజమాన్యం

**కల్లూరు:** ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తుండడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే పేద పిల్లల సౌలభ్యం కోసం స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీ వైవల్(ఎస్‌ఆర్‌ఐ) స్పందించి రెండు నెలల పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు రూ.4 లక్షలు వితరణ చేశారు. ఫౌండేషన్ వాలంటీర్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వరకా రామారావు, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలనే లక్ష్యంతో దాత వైవల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. అధ్యాపకులు, విద్యార్థులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. వరకా రామారావు కుమార్తె ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న అక్షర విద్యార్థులను ఉద్దేశించి చేసిన మోటివేషన్ స్పీచ్ విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వాలంటీర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వరకా రామారావు, అధ్యాపకులు భాను, కిరణ్‌కుమార్, వీరభద్రం, వరలక్ష్మి, జ్యోతి, శ్రీరాములు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయండి

**టీఎస్ యూటీఎఫ్ జిల్లా సభను..**


తల్లాడ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

**తల్లాడ/చింతకాని:** సత్తుపల్లిలో జరిగే టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని శుక్రవారం యూటీఎఫ్ తల్లాడ, చింతకాని మండల కమిటీల ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. శుక్రవారం తల్లాడలోని.. అన్నారుగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, చింతకానిలోని పాతర్లపాడు హైస్కూల్‌లో మహాసభల పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 14, 15 రోజుల పాటు జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రవి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ, చింతకాని మండలాల టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు జీడీఎస్వీ రమణ, షేక్ లాల్ సయ్యద్, కార్యదర్శులు తాళ్లూరి శ్రీనివాసరావు, తోటకూరి శ్రీనివాసరావు, నాయకులు మురళీకృష్ణ, రామారావు, స్వరాజ్యలక్ష్మి, రామక్రిష్ణస్వామి, రాములు, రాజయ్య, జయశంకర్, కృష్ణప్రసాద్, సైదేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ సభను..**

**కొణిజర్ల:** ఈ నెల 15వ తేదీ ఆదివారం నాడు ఖమ్మం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే తెలంగాణ ప్రగతి శీల ఆటో మోటర్ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్.లాల్‌మియా పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తీగలబంజరలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అర్హత ఉన్న ఆటో కార్మికులకు బస్సు డ్రైవర్లుగా, మెకానిక్‌లుగా అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్తనబోయిన లెనిన్, కృష్ణమాచారి, నాగరాజు, యూసఫ్‌మియా, కొండయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.